



# కన్ను

-వి. రాజారామమోహనరావు

**సిటీ....**

ఉదయం పదకొండు గంటల వేళ....

మామూలుగానే రాజధానీ నగరం అవసరాన్ని మించిన హడావిడితో గొడవగొడవగా వుంది.

ఆడ, మగా, చిన్నా, పెద్దా.... అందరూ వదిలేసిన బాణాల్లా నడిచేస్తున్నారు. చూసి ఆగి వినే వోపిక లేనట్టే వున్నారు.

కొందరికి ఆఫీసు ఆలశ్యమైన తొందర. కొందరికి ఆకలి తొందర. మరి కొందరికి సుఖం తొందర. యింకా కొందరికి కొన్నేళ్ళ నగర జీవితం వల్ల అలవాటై పోయిన తొందర.

కానీ వాడొక్కడికే తొందరలేనట్టు.... చావుని వీలున్నంత ఆలస్యం చెయ్యటానికి యింకా ఆ శరీరంలో ని ప్రాణం తాత్సారం చేస్తున్నట్టు....అక్కడ పడున్నాడు. అర గంటకి కనీసం నలభై మంది ఆ పక్క

నుంచే వెడుతున్నా ఎవరూవాడివేపు దృష్టి నిలిపి చూడ్డంలేదు. ఎవరితొందర వాళ్ళది. ఎవరి ఘోష వాళ్ళది.

పెంటకుప్పల్నీ.... మురుక్కాలవల్నీ.. అప్పుడప్పుడు రోడ్డుమీదపడుండేశరీరాల్నీ నగరజీవితం సాధారణంగా దృష్టి నిలిపి పరికించి చూడదు. అలా చూట్టంవల్ల వుప యోగంకానీ, వుత్సాహంకానీ వుండవు.

వాడెవరో, వాడి పేరేమిటో తెలియదు. విపరీతంగా ఈగలు ముసిరినప్పుడు కొద్దిగా కదులుతున్న శరీరంవల్ల యింకా ప్రాణం వున్నట్టు తెలుస్తోంది. చాలా గంటలుగా వాడలా పడివున్నట్టు వాడి వరిస రాలవల్ల తెలుస్తోంది.

ఆ శరీరంలోని ఎముకల్ని కప్పటానికే వోపిక చాలదన్నట్టున్న వాడి చర్మం దుమ్ముకొట్టుకుపోయింది. మురికి, కుళ్ళూ కలిసి ఛండాలంగావుంది.... అంతేకాదు.... వాడి విసర్జనలే వాడివొంటినిండావున్నాయి. అరచేత్తోసహా, కాళ్లూ పిక్కలూ అశుద్ధ మయంగా వున్నాడు.... కొంచం స్పృహ వున్న ఏమనిషైనా అలా పడుండలేడు.

వాడు చచ్చిపోతాడు.... అదృష్టం అనే దేమేనా వుంటే తొందరగా చచ్చిపోతాడు. వాడుచచ్చిపోయాక వాణ్ణి వొదిలించుకోటం తప్పక నగరం చచ్చినట్టు వాడి వేపు చూస్తుంది. అంతవరకూ ఎవరూ చూడరు.

చూసినా జరిగేదేంలేదు. చూసినవాళ్ళ కళ్ళు తిరుగుతాయి. మనసు, చూపు వికారంగా మారిపోతాయి. తలతిప్పుకుని, మనసు తిప్పుకుని. ఆలోచన మళ్ళించేసుకుని ఆ చోటుకి సాధ్యమైనంత దూరంగా వెళ్ళిపోయి. ఒకరోజుకో. రెండురోజులకో మూడు రోజులకో మరిచిపోవాలి. అంతకుమించి ఆ నగరంలోని లక్షల సంఖ్యలోని సామాన్యజనం చెయ్యగలిగిందేంలేదు.

వాణ్ణి తీసికెళ్ళి ఏదోహాస్పిటల్‌లోచేర్చి సేవచేసే శక్తి వోపిక నగరంలోని మామూలు ప్రజలందరికీ వుండాలనుకోటం అసమంజసం.

వాణ్ణి అలా అంతదారుణంగా చూశ్కేక మానవత్వంతో ఏంచెయ్యలేక మొండిగా ఏ పెద్దబండరాయో వాడి మీద పారేసి ఎవరేనా వాడికి విముక్తి కలిగిస్తే బావుణ్ణనుకోటం లీగల్‌గా అమానుషం. అందుకనే వ్యక్తిగత స్థాయిలో ఎవ్వరూ ఏంచెయ్యలేని దారుణం యిది.

కానీ నగరానికి యిది కొత్తకాదు. నగరపారిశుధ్యపు ఎకౌంట్‌లో కుళ్ళూ మురికీతోపాటు అనాధప్రేతాల్ని తొలగించే ఖర్చుపెరుగుతూనేవుంది. ఆ విషయం చాలామందికి తెలుసు.

చచ్చిపోయేవాణ్ణి చచ్చిపోయే వరకూ వదిలేయటం తప్ప ఏం చెయ్యగలం చెప్పండి. అలవాటైపోయిన అనేక దరిద్రాల్లో యిదీ ఒకటి. నగరజీవిత దరిద్ర నాగరికత స్థాయి అది.

* * *

టౌన్.........

ఆ తాలూకాకి, ఆ జిల్లాకి ముఖ్యపట్టణం ఆ వూరు.

పదేళ్ళక్రితం ఆ వూరి జనాభా రెండు లక్షలు. యిప్పుడుమూడులక్షలకి పెరిగింది. వూరూ పెరిగింది కానీ అడ్డదిడ్డంగా పెరిగింది. జనం అవసరాలకి అనుగుణంగా పెరగలేదు. ఏదో వాళ్ళూ అవూళ్ళో వుంటున్నాం అని జనంచెప్పుకునేలా పెరిగింది.


అలాంటి చాలా టౌన్స్‌కి వున్నట్టే ఆ టౌన్‌కి వో కాలవుంది. ఆ కాలవ వూరిని రెండు భాగాలు చెయ్యటం వల్ల కాలవ యివతల. కాలవ అవతలా అని వ్యవహరిస్తారు. కాలవ దాటటానికి మూడు వంతెనలున్నాయి. వూరు మధ్యనున్న వంతెన్ని పెద్దొంతెనంటారు. వూరికి అటుచివర. యిటుచివర వున్న వంతెనల్ని చిన్నొంతెనలంటారు.


చాలాఏళ్ళనుంచి ఆ రెండు చిన్న వొంతెనల మధ్యే ఆ వూరుంది. పెరిగిన వూరు ఆ పరిధిలోనే పెరిగింది. యిప్పటికీ ఆ వంతెనలే ఆ వూరికి హద్దులు.

పంటలకి అవసరమైనప్పుడే ఆ కాలవకి నీళ్ళు వదుల్తారు. మిగిలినప్పుడు మోకాలిలోతు మించి నీళ్ళుండవు. నీళ్ళు ఎక్కువగా వుండనప్పుడు ఆకాలవవాసన ఎక్కువగా వుంటుంది, కొత్త వాళ్ళకైతే దుర్భరంగా కడుపు దేవేసేలా వుంటుంది.

ఇది వరకూ ఆకాలవకి అటూ, యిటూ పాకలుండేవి అవి యిప్పుడు విపరీతంగా పెరిగాయి. గట్టుదిగి కాలవలోకి వ్యాపించాయి. ఆ పాకలోంచి కాలు బైటపెడితే యించుమించు కాలవనీళ్ళల్లో పెట్టినట్టే. అంతగా పెరిగిపోయాయి.... వందల్లో వున్న ఆ పాకల్లో వేలసంఖ్యలో జనాభా బతకటం నేర్చుకున్నారు. చాలామంది కొంచం సేపేనా ముక్కు మూసుకోకుండా భరించలేని ఆ దుర్వాసన వాళ్ళని బతికిస్తున్న వూపిరి.... వేలసంఖ్యలో అక్కడ వున్నవాళ్ళే కాదు. వూళ్ళోని చాలామంది అన్నివేళలా వచ్చి తమకడుపు బరువు దించుకుని.... ఆ దుర్వాసన పెంపుకి సాయం చేసేదీ ఆ కాలవ దగ్గరే.... ఆంధ్రదేశపు కాలవల ప్రయోజనాల్లో అదొకటి కాబట్టి అది ఎవరికీ తప్పుగా తోచదు.

అలాంటి కాలవపక్క పాకల్లోకి ఆర్నెల్లక్రితం తలదాచుకోటానికి వచ్చింది సుబ్బులు.






ఏదోరకం కూలీ.నాలీచేసుకు బతకాలని తప్ప వేరేవుద్దేశంలేదు సుబ్బులుకి. మొగుదొది ేసిన బతుకుతోపాటు మూడేళ్ళకొడుకున్నాడు. బతకలేక పోతానా అనుకుంది సుబ్బులు.

శరీరం తప్ప పెద్దగా అందంలేని తన దగ్గిరికి తాగుతోతూ తిరుగుతోతూ అయిన మొగుడు తిరిగొస్తాడని సుబ్బులికి పెద్దగాఆశాలేదు. అంతకుముందు వాడు ఇద్దరాడాళ్ళని వదిలేశాడు. వాళ్ళదగ్గిరికీ రాలేదు వాడు. వాళ్ళకీ పిల్లలున్నారు మళ్ళీ ఎవర్నో కట్టుకుంటాడు...మళ్ళీవదిలేస్తాడు. అందుకే తన బతుకు తను బతకాలని.... పూరికి, నాలుగు రకాల పనులకి దగ్గరగా వుంటుందని ఆపాకల్లోకి వచ్చింది.

ఏదోరకంగా తలదాచుకుని బతకటానికి ఆవూళ్ళో ఆపాకలకన్నా చవకైన జీవితం యింకోటి లేదనుకుంది సుబ్బులు. కానీ అదికూడా ఆర్థికంగా తనశక్తికి మించిందే అని సుబ్బులుకి నెల తిరక్కముందే తెలిసింది.

కొత్తలో ఆ పాకల దగ్గర దుర్వాసనకి ముక్కు మూసుకునేది. మురికి నీళ్ళకి దూరంగా మెసిలేది. కానీ రాను రాను అందర్లాగే అన్నీ అలవాటైపోయాయి. ఎటొచ్చీ బతుకుమార్పుకి సుబ్బులుతట్టుకున్నట్టు సుబ్బులు కొడుకు.... మూడేళ్ళ పసివాడు తట్టుకోలేకపోయాడు.

అక్కడ వేలసంఖ్యలో జనం వుంటే లక్షలసంఖ్యలో రకరకాల క్రిములున్నాయి. అందులో కొన్ని క్రిములకి సుబ్బులు కొడుకు రక్తంమంచి రుచి అనిపించింది. తమ శక్తికొద్దీ వాడి వొంట్లోకి రోగాల్ని ఎక్కించాయి.

నాలుగు నెలలు కూలికి వెళ్ళినట్టే కుర్రాణ్ణి తీసుకుని డాక్టరు దగ్గరకి వెళ్ళింది సుబ్బులు....రోజూ, రెండూ మూడూ ఖర్చుచేసింది. జ్వరం....దగ్గు .... కురుపులు ....కుర్రాడికి వోరోజు తగ్గినట్టు తగ్గినామళ్ళీరెండోనాటికి వచ్చేస్తున్నాయి- మళ్ళీడాక్టరు....మానవమాత్రురాలు కాబట్టి పాపం సుబ్బులికి వోపికతగ్గింది. ఇప్పుడు వోపికవున్నప్పుడే డాక్టరు దగ్గిరకి వెడుతోంది .... డబ్బున్నప్పుడే మందులు వేస్తోంది. కుర్రాడు రోజురోజుకీ క్షీణిస్తున్నాడు. బతుకేమిటో, చావేమిటో తెలియని ఆ మూడేళ్ళ పసివాడికి ఈ గొడవలేం తెలియవు....అక్కడున్నచాలామంది పసివాళ్ళలాగే ఆ కాలవేంచేస్తే అది భరిస్తాడు.

కేవలం ఆర్నెల్లల్లో ఆ పాకల బతుకు సుబ్బుల్ని పూర్తిగా మార్చేసింది. సుబ్బులికిప్పుడు ఏవుద్దేశంలేదు. ఏ నిరాశా లేదు. ఆపాకల్లో చాలామంది ఆడాళ్ళలాగ తాగుతోంది....ఎవరేనా అయిదో, పదో యిస్తే వాళ్ళు అప్పచెప్పటానికి సిద్ధపడే స్థితికి దగ్గరగావచ్చేసింది...బంతిలాఆరోగ్యంగా వుండే కొడుకు అలా రోజురోజుకీక్షీణించిపోతుంటే .... వాణ్ణి అలా చూస్తున్నప్పుడల్లా కాస్సేపు ఏడుస్తోంది—యింకా పూర్తిగా చచ్చిపోని ఆ తల్లి మనసు.

ఆ పాకలింకా పెరుగుతూనేవున్నాయి- వాటిల్లోకి యింకా చాలామంది వస్తూనే వున్నారు....కూలీ, నాలీకోసం .... బతుక్కోసం వచ్చి .. అలా బతకలేక చాలా మంది చాలా రకాల కుళ్ళువార్లలోకి వెడుతూనేవున్నారు....అందరూకన్నట్టేవాళ్ళు పిల్లల్ని కన్నా ...వాళ్ళపిల్లల్లోచాలామంది పసితనం దాటకముందే చచ్చిపోతున్నారు.

అలాంటి కాలవపక్కన బతకటానికి వస్తుంటే పసిపిల్లలేమిటి....పెద్దవాళ్లు చచ్చిపోయినా ఆశ్చర్యంలేదు. జంతువులేచచ్చిపోతాయి....మనుషులోలెఖ్ఖ .... తెలిసీ తెలియకాకూడా ఆ బతుకుగడుస్తూనేవుంది.

నూటికి అరవైమంది యింతకన్నా దరిద్రంగా వున్నారని లెక్కలు చెబుతున్నప్పుడు ఆ పాకల్ని ఆ టౌను జనాభా నిత్యం అలవాటుగా చూట్టంలో ఆశ్చర్యపోకపోవటంలో పెద్ద చిత్రమేంలేదు.

* * *

## విలేజ్

ఇంగ్లీషు అలవాటు ప్రకారం చాలా మంది పెద్దలు దాన్ని 'విలేజ్' అంటారు కాని నిజానికి విలేజికి వుండాల్సిన లక్షణాలేంలేవు దానికి.

మూడొందల కుటుంబాలు బతుకుతున్న మారుమూల వూరది. పేరుకి గ్రామ పంచాయితీ, దాని కార్యవర్గం వున్నా మామూలుగానే....అంతా ఒకేవ్యక్తి అధికారంలోవుంది.


రెండు అగ్రకులాలున్నాయి. వాటి పెద్దలున్నారు.వాళ్ళమధ్యతగవులున్నాయి. ఇద్దరికీ పార్టీలున్నాయి.

ఇంచుమించు ఆ వూరంతా భూమిమీదే బతుకుతున్నా, ఆ వూరి భూమి మాత్రం వోపది కుటుంబాల సొంతం.

వర్షాలొస్తేనే ఆభూములు పండుతాయి భూములు పండితేనే ఆ వూళ్ళో చాలా మందికి తిండుంటుంది.

వర్షాలొస్తాయో.... రావో?.... పంటలు పండుతాయో.... లేదో.... పాత అప్పులు పోను తిండిగింజలేనా మిగులుతాయో లేదో అని ఆ వూళ్ళో వాళ్ళు ప్రతిఏడాదీ భయపడుతూనే వుంటారు.

వూళ్ళోని రెండు పార్టీల్లో ఏదోపార్టీలో చేరి ఎవరికో ఒకరికి బానిసచాకిరీ చెయ్యక వాళ్ళకి తప్పదు. రెండు వర్గాల




బావిసకూటం ఆ వూరు.

**పంటలభయం.... అప్పులభయం.... యజమానుల భయం....** నీ టి కి తో దు వాళ్ళకి ఆ సంవత్సరం మ రో గ డ్డు చిక్కొచ్చి పడింది.

వర్షాల్లేవు.... పొలంపనుల్లేవు....దానికి **తోడు తట్టుకోలేని వేసవి.... భూమీ తట్టుకోలేక విచ్చిపోయింది. నీరు తట్టుకోలేక ఆకాశానికి ఎగిరిపోయింది.**

అన్ని దరిద్రాలు తెలిసిన వాళ్ళకి.... అంతటి నీటి దరిద్రం యిదివరకు తెలీదు. వూళ్ళోని పెద్దిళ్ళల్లో రెండుమూడు బా వు లున్నాయి. బాగా దగ్గర వాళ్ళని, వా ళ్ళ కులంవాళ్ళనీ రానిస్తారు. అలగా జనాన్ని. మిగిలిన అద్దమైన కులాల వాళ్ళనీ వాళ్ళు రానివ్వరు. రానిచ్చినా వెళ్ళేంత ధైర్యం ఆవూరి బానిసలకి లేదు.

మూడుమైళ్ళు వెళ్ళి.... తిరిగి వెనక్కి మూడుమైళ్ళు మోసుకొచ్చి.... బొ ట్టు బొట్టు లెక్కేసుకుని నీళ్ళుతాగి ఆవేసవి గడిపారు. చివర్లో మట్టినీళ్ళు మురికినీళ్ళు మట్టితడి.. నీటితో దప్పిక తట్టుకున్నారు.

గొడ్డూ గోదాతోపాటు కొంతమంది జనం చచ్చి పోయారు. ఆ వేసవి వాళ్ళకి ఎన్నో వేల కరువుల్లా. ఎ న్నో ల క్ష ల క్షామాల్లా గడిచింది.

వేసవిగడిచింది ...కొద్దిగా వ ర్షా లొ చ్చాయి....నూతుల్లో,చెరువుల్లో....కొద్దిగా నీళ్ళుచేరాయి.... అంత గడ్డుగా లేదు. అయినా వాళ్ళకి భయం .... వచ్చే వేసవీ యిలాగే వుంటే అన్న భయం .... యీ మాత్రం మట్టినీళ్ళు మరో ఐదు మైళ్ళు వెళ్ళినా దొరక్కపోతే అన్న భయం. త మ వా ళ్ళ నీ బతుకుల్నీ ఎంతగా పోగొట్టుకోవాలో అన్న భయం. నీటిని తలుచుకుంటేనే భయం..

నీళ్ళకి చాలా చోట్ల ధర లేదు. కానీ ఆవూళ్ళో వాళ్ళకి నీళ్ళంటే చావుబతుకు-అలా తయారైంది.

చాలాచోట్ల .... ప్రతి వేసవిలో తాగే నీటికోసం అల్లల్లాడి నాశనమవుతూ భయపడుతూ బతికే యీదేశంలోని గ్రామాల జాబితాలోకి ఆ గ్రామం చేరింది.అంతకు మించి మరేం జరగలేదు.

అయినా మారు మూల వూరు.... బైటకేం తెలుస్తుంది. తెలిసినా ఎవరి క్కావాలి ఎవరికి వోపికుంది ...

అంతర్జాతీయ సమస్యల ముందు అఫ్టరాల్ యీ విలేజీ ఎంత....

* * *

ఏళ్ళకి ఏళ్ళుగడుస్తున్నాయి.... పాలన సాగుతూనేవుంది. ప్రపంచం దృష్టిలో ప్రగతిసాధిస్తూనే వున్నాం. న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నెలకొల్పటం. ప్రయోగాలు యీదేశంనుంచి గొప్పసైంటిస్టులు తయారయారన్నఖ్యాతి చాలాబడుగుదేశాలకన్న పారిశ్రామిక ప్రగతి అతి తక్కువ కాలంలో ఆసియాడ్ అలీనదేశాల సమ్మేళనం అద్భుతంగా నిర్వహించుకున్న గొప్ప.... యిలా .... చాలా సాధిస్తూనే వున్నాం....

అయినా దేశాన్నిండా మనిషికి కావాల్సిన కనీస అవసరాల దరిద్రం చాలా వుంది.

కోట్లకొద్దీ జనాభా. కులాలు, మతాలు యిలా మిగిలిన వాళ్ళకిలేని చాలాయిబ్బందులు మనకున్నాయి. ఎవరు చెయ్యాలనుకున్నా కొద్ది రోజుల్లో దేశం పూర్తిగా మారిపోయి అందరికీ సుఖమయం అయిపోదు.

సామాన్యుడు చూసి వినీ. ఏం చెయ్యలేని స్థితి వున్నా ఆసియాడ్‌ని చూచిన కన్ను అలీనదేశాల సమావేశాన్నిఏర్పాటు చేసిన కన్ను యీ గొడవల్నీ.... అలాగే చూస్తే. వివిధ అధికారులు అదే రకంగా పూనుకుంటే.... యేడాదికి కనీసం ఒక్క వూరు ఒక్క టౌను....ఒక్కసిటీ దరిద్రమేనా తగ్గదా. మంచినీళ్ళు....వైద్యమో. ఏదో బాధ కొంచమేనా తీరదా.ఆ కన్ను తలుచుకున్న ప్రతిపనీ అవుతోంది మరి. నిధులకి లోటుండదు.... దేనికీ లోటుండదు.

అందుకే ఆ అసలైన కంటివేపు సామాన్యుల కళ్ళన్నీ సరిగ్గా చూస్తే .... మధ్యమాలన్నీ సరిగ్గా పూనుకుంటే ....